క్లుప్తంగా

24న శ్రీషిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం నర్రావారివీధిలోని శ్రీలక్ష్మీ గణపతి, శ్రీషిర్డీ సాయిబాబా మందిరం 18వ వార్షికోత్సవం ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు ట్రస్టీ ఎం.దుర్గాప్రసాద రామకోటేశ్వరరావుశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 24వ తేదీ ఆదివారం ఉదయం 5.15 గంటలకు బాబావారికి కాకడ హారతితో వార్షికోత్సవాలు ప్రారంభమవుతాయని అన్నారు. ఆరు గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఎనిమిది గంటలకు సహస్ర గులాబీ పూజ, తొమ్మిది గంటలకు లోక కల్యాణార్థం శ్రీలక్ష్మీగణపతి సాయి మూలమంత్ర, దత్త, నవగ్రహ, నక్షత్ర హోమాలు జరుగుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. కావున భక్తులు వేడుకల్లో పాల్గొని బాబావారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అయాన్ ఐ ఆస్పత్రి సౌజన్యంతో సింగ్‌నగర్ స్టేడియంలో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ చిన్నం రామకృష్ణ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు, సిబ్బంది 189 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ డెప్యూటీ గవర్నర్ ఎన్‌బీజీఎం ప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు కే అరుణకుమారి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైదిక కమిటీలో ఇద్దరికి స్థానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన వైదిక కమిటీలో మరో ఇద్దరికి స్థానం కల్పిస్తూ ఈఓ కెఎస్.రామారావు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఉప ప్రధాన అర్చకులు ఎన్‌వీడీఎం. ప్రసాద్, ముఖ్య అర్చక రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రిలకు వైదిక కమిటీలో స్థానం కల్పించారు. ప్రస్తుతం వైదిక కమిటీలో ఎనిమిది మంది సభ్యులు బాధ్యతలు నిర్వహిస్తుండగా, అదనంగా మరో ఇద్దరికి స్థానం కల్పించడంతో కమిటీలో సభ్యుల సంఖ్య పదికి చేరింది.

చంద్రబాబు బీసీ డిక్లరేషన్ ఒక బూటకం

లబ్బీపేట(విజయవాడతూర్పు): బీసీల పట్ల కపటప్రేమ చూపుతూ చంద్రబాబు ఇటీవల ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఒక బూటకమని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కంపెల్ల భాను లక్ష్మీనారాయణ అన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఏనాడైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చిన సందర్భం ఉందా అని ప్రశ్నించారు. అధికారం కోసం ఎన్ని హామీలు అయినా ఇస్తారని, ఆ తర్వాత వాటిని గాలికొదిలేస్తారన్నారు. రాష్ట్రంలో బీసీలకు న్యాయం జరిగింది వైఎస్సార్ సీపీలోనే అన్నారు. గత 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చారన్నారు. కానీ చంద్రబాబుకు హామీలు నెరవేర్చిన సందర్భం ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడైనా ఉందా అని నిలదీశారు. బీసీలను మరోసారి మోసగించేందుకు డిక్లరేషన్ అంటూ మాయమాటలు చెబుతున్నారని చెప్పారు. ఆయన మోసకారి హామీలను బీసీలు నమ్మరని పేర్కొన్నారు. చంద్రబాబు విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఈ నెల 7వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బొంగు రాజు(40) అనే వ్యక్తి మృతి చెందినట్లు నున్న పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నున్న గ్రామానికి చెందిన రాజు గురువారం హృదయ నగర్ కాలనీ వద్ద నడుచుకుంటూ వెళుతుండగా టాటా యాస్ ట్రక్ ఢీ కొట్టింది. గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతను చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు

కృష్ణలంక (విజయవాడతూర్పు): త్వరలో జరగనున్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కృష్ణలంకలోని పలు వీధుల్లో శనివారం కృష్ణలంక పోలీస్‌స్టేషన్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. సత్యంగారి హోటల్ సెంటర్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ ఫీడర్ రోడ్డు, ఆర్చి రోడ్డు, హైస్కూల్ రోడ్డు, కాటూరివారి వీధి, రాణిగారి తోట మీదుగా స్క్రూబ్రిడ్జి వరకు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల నిమిత్తం ఏసీపీ రత్నరాజు నేతృత్వంలో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం ఈ కవాతు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలకు భరోసా కల్పిస్తూ ఈ ఫ్లాగ్ మార్చ్ జరిగింది. కార్యక్రమంలో సీఐ ఎ.మురళీకృష్ణ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.





వైభవంగా రథోత్సవం..



మహాశివరాత్రిని పురస్కరించుకొని వన్ టౌన్ కెనాల్ రోడ్డులో శనివారం ఆది దంపతుల రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మల్లేశ్వరుడు తన ఉభయ దేవేరులతో కలిసి రథాన్ని అధిష్టించి భక్తులకు దర్శనమిచ్చారు. కోలాటాలు, పులివేషాలు, బేతాళ నృత్యాలు, తదితర జానపద కళారూపాల నడుమ స్వామిని ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











కనుల పండువగా శాంతికల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. శనివారం తెల్లవారుజామున ఆలయకమిటీ ఆధ్వర్యంలో శాంతి కల్యాణం కనుల పండువగా జరిగింది. మధ్యాహ్నం దాత వైఎస్సార్ సీపీ నాయకుడు వేజెళ్ల రాజేంద్ర ప్రసాద్, విజయలక్ష్మి దంపతుల సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి ప్రసాదంను స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ కార్యదర్శి దాట్ల శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు తదితరులు పర్యవేక్షించారు.



ముత్యాలంపాడులో పార్వతీ పరమేశ్వరులు

శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో..

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో శనివారం శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివకామేశ్వరి సమేత నీలకంఠేశ్వర స్వామివారి కల్యాణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణ ఉత్సవంలో పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం కొనసాగింపు

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వైఎస్సార్ సీపీ గెలుపుతోనే కొనసాగుతాయని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 63వ డివిజన్ మాస్టర్‌మైండ్స్ స్కూల్ గ్రౌండ్ వద్ద శనివారం ఆయన డివిజన్‌లోని డ్వాక్రా గ్రూపు మహిళలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు మహిళలకు రుణమాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు మోసం చేశాడని, కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతలుగా రుణమాఫీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. అదే విధంగా ప్రస్తుతం ఉన్న వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు, స్త్రీ నిధి, ఉన్నతి పథకం కింద ఎస్సీ,ఎస్టీలకు ఆటోలు కొనుగోలు పథకాలు అమలులో ఉన్నాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తనను, ఎంపీ కేశినేని నానిని గెలిపించాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. అన్ని సమయాల్లో మీకు అందుబాటులో ఉంటానని అన్నారు. చంద్రబాబు కేజీ బంగారం, బెంజ్ కారు ఇస్తానని మాయ మాటలు చెప్పి మోసం చేస్తాడని ఆ మాటలు నమ్మొద్దని పేర్కొన్నారు. కోవిడ్ లాంటి భయంకర పరిస్థితుల్లో కూడా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు ఆపలేదని ఎమ్మెల్యే వెలంపల్లి గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలో ఉండగా 30 లక్షల పింఛన్లు ఇస్తే, జగనన్న ప్రభుత్వంలో 61 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతోందని వివరించారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జగనన్న లేఅవుట్‌లో నిర్మాణాలు పూర్తి చేసుకొన్న 1,400 గృహాలను రెండు రోజుల్లో లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల అర్హత ఉండి పథకాలు అందని వారికి ఎన్నికల తర్వాత వచ్చే విధంగా చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మోదుగుల గణేష్, టిక్యం కృష్ణ, తిరుపతిరావు, డివిజన్ ఇన్‌చార్జి జలసూత్రం శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, సామ్రాజ్యం పాల్గొన్నారు.



డ్వాక్రా గ్రూపు మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

సహకార విలువలతోనే సంఘాల మనుగడ

కృష్ణలంక(విజయవాడతూర్పు): సహకార విలువలతోనే సంఘాల మనుగడ సాగిస్తాయని మాజీ ఎమ్మెల్యే, సీనియర్ సహకారవేత్త ఎం.ఆంజనేయులు అన్నారు. నిజాయతీ, నిబద్ధత, కోఆపరేటివ్ ప్రిన్సిపల్స్ మీద నమ్మకం విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంకును ఈరోజు అగ్రస్థానంలో నిలవడానికి ప్రధాన కారణాలని తెలిపారు. నాఫ్కాబ్ డైరెక్టర్‌గా ఎన్నికైన విశాఖ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావును శనివారం విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ బ్యాంకు సిబ్బంది, పాలకవర్గం ఆధ్వర్యంలో సన్మానించారు. బ్యాంకు డైరెక్టర్ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంజనేయులు మాట్లాడారు. విభిన్న రాజకీయ దృక్పథాలు కలిగిన పాలకవర్గంలోని సభ్యులు రాజకీయాలకు అతీతంగా సమష్టిగా ముందుకు వెళ్లడం బ్యాంకు ప్రారంభం నుంచి వస్తున్న ప్రత్యేక విధానమన్నారు. బ్యాంకు పురోభివృద్ధిలో ఇది కీలకమైన అంశం అని చెప్పారు. సన్మాన గ్రహీత చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఈ సంస్థ అభివృద్ధి వెనుక అనేకమంది సమష్టి కృషి ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎస్.కామరాజు, డైరెక్టర్లు ఎం.రాఘవరావు, కోటేశ్వరరావు, జి.జనార్ధనరావు, పీవీ రామారావు సీహెచ్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.



రాఘవేంద్రరావును సత్కరిస్తున్న విశాఖ కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లు, సిబ్బంది

భార్య కనిపించడం లేదంటూ ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కుటుంబ సమస్యల కారణంగా తన భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిందంటూ శనివారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గులాబీతోటకు చెందిన వడ్డీ నరేష్‌కు 2017లో శ్రీవాణితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. శ్రీవాణి(28) బీఆర్‌టీఎస్ రోడ్డులోని మురుగన్ డాబాలో పనిచేస్తుంది. శ్రీవాణి, అత్త రాజులమ్మకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాజులమ్మకు, శ్రీవాణికి గొడవ జరిగింది. దీనిపై భర్త నరేష్ భార్యను కోపగించుకున్నాడు. దీంతో మనస్థాపం చెందిన వాణి ఇంట్లోంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో శనివారం సాయంత్రం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం మహాపుణ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): అన్నదానం మహాపుణ్యమని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా కండ్రిక రాధానగర్ శివాలయంలో శనివారం జరిగిన శివపార్వతుల కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం ఎంతో మిన్న అని పేర్కొన్నారు. ముందుగా శివపార్వతులకు ఆయన పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, షేక్ ఇస్మాయిల్, కొక్కిలిగడ్డ నాని, మాతా మహేష్, డివిజన్ ఇన్‌చార్జి జలసూత్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ గుడి అభివృద్ధికి కృషి చేస్తా..

స్థానిక 64వ డివిజన్ వాటర్ ట్యాంక్ వద్ద మత్స్యకార కుటుంబాల కులదైవం పోలేరమ్మతల్లి గుడి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పోలేరమ్మతల్లి, శ్రీకనకదుర్గమ్మ, కాళీకామాత ఆలయాల్లో శనివారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. పోలేరమ్మ, శ్రీకనకదుర్గమ్మ, కాళీకామాత గుళ్ల అభివృద్ధికి తాను కృషి చేస్తానని అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు చెక్క నరసింహారావు, నందుపల్లి శివ తదితరులు పేర్కొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



పాయకాపురం(విజయవాడరూరల్): శాంతినగర్‌లోని శారద హైస్కూల్లో లయన్స్‌క్లబ్ సుప్రీమ్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. అనంతరం పేదలకు చీరల పంపిణీ, హెచ్‌ఐవీ, క్యాన్సర్ పేషెంట్లకు పోషకాహారం పంపిణీ, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేశారు. శారద హైస్కూల్ కన్వీనర్ పెనిమల్స్ అప్పలరాజు మాట్లాడుతూ పేదలకు సాయం చేస్తున్నందుకు లయన్స్‌క్లబ్ సుప్రీమ్‌కి, లయన్స్‌క్లబ్ గవర్నర్ శంకర్‌గుప్తాకు అభినందనలు తెలిపారు. అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, చక్రధర్, అమర్నాథ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో సమాజాభివృద్ధి



గుణదల (విజయవాడ తూర్పు): మహిళలు సాధికారత సాధించినప్పుడే సమాజం అభివృద్ధి దిశగా పయనిస్తుందని సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుణదలలోని సోషల్ సర్వీస్ సెంటర్‌లో మహిళా సమగ్ర సాధికారత సదస్సు శనివారం నిర్వహించారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో తమ ప్రతిభను కనబరుస్తున్నారని తెలిపారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం ఇలా అన్నింటిలో దూసుకుపోతున్నారని పేర్కొన్నారు. మహిళలు విద్యావంతులైతే ఆ కుంటుంబంతో పాటు సమాజం అభివృద్ధి దిశగా పయనిస్తుందని వివరించారు. మరో అతిథిగా పాల్గొన్న వేటపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నారాయణ స్వామి మాట్లాడుతూ మహిళా సాధికారత ధ్యేయంగా ప్రభుత్వాలు పనిచేయాలని కోరారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినపుడే సమాజం పురోగమిస్తుందని పేర్కొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అమలోద్భవి మహిళా సంఘానికి 9 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. అంతకు ముందు మహిళలు ఏలూరు రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ డైరెక్టర్ ఫాదర్ జోజి తంబి, ఫాదర్ వినోద్, సిస్టర్ గ్రేసి, పసల బాలస్వామి పాల్గొన్నారు.

మళ్లీ జగనే సీఎం కావాలన్నది ప్రజల ఆకాంక్ష

సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని 25వ డివిజన్‌లో శనివారం 'గడప గడపకు మన వెలంపల్లి శ్రీనివాస్' కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ బంకా శకుంతలతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. సీతారాంపురం ఏరియాలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గడప గడపకు వచ్చిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు స్థానిక మహిళలు ఘన స్వాగతం పలికి హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. 99 శాతం హామీలు అమలు చేశారని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూరిందని చెప్పారు. తమ ప్రభుత్వంలో మేలు జరిగితేనే ఓటు వేయమని సీఎం వైఎస్ జగన్ ప్రజలను కోరుతున్నారని, ప్రజలు కూడా జగనే సీఎం కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఐదేళ్లలో నగరంలో జరిగిన అభివృద్ధి గతంలో ఎప్పుడూ జరగలేదని అన్నారు.

బాబు, పవన్ ఢిల్లీలో పడిగాపులు

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇద్దరూ ఢిల్లీలో పడిగాపులు కాస్తున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి అన్నారు. 2019 ఎన్నికల్లో మోడీని, బీజేపీని తిట్టినా వీళ్ళు ఏ అజెండాతో బీజేపీని కలుస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. జగనన్న ధాటికి తట్టుకోలేక మోడీ కాళ్లు పట్టుకుంటున్నారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలలో ఉన్న బలాన్ని చూసి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ భయపడుతున్నారని అన్నారు. చంద్రబాబుకు ఏ మాత్రం సిగ్గు లేదన్నారు. ఎంత మంది గుంపులుగా వచ్చినా వైఎస్సార్ సీపీ గెలుపును ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. విజయవాడ సెంట్రల్‌లో తాను భారీ మెజార్టీతో గెలవబోతున్నట్లు చెప్పారు. బోండా ఉమా ఏనాడు ప్రజల్లో లేరన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల కన్నా కేఏ పాల్ నయమని, రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 25వ డివిజన్ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, పలువురు కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



'గడప గడపకు' కార్యక్రమంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వెలంపల్లి, కేశినేనిని గెలిపించుకోవాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రానున్న ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును, విజయవాడ ఎంపీ కేశినేని నానిని గెలిపించుకునేందుకు యాదవులందరూ కలిసికట్టుగా కృషి చేయాలని మాజీ డెప్యూటీ మేయర్ గోగుల వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రభ కాలనీలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి యాదవులందరూ కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఏలూరురోడ్డులోని టింబర్ మర్చంట్స్ హాల్‌లో జరిగే యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో యాదవ కుటుంబాలు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో సెంట్రల్‌లో బొండా ఉమా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. యాదవులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. అటువంటి నాయకుడికి యాదవులందరూ మద్దతు తెలుపుతూ రానున్న ఎన్నికల్లో వెలంపల్లి, కేశినేనిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉమ్మడి వెంకట్రావు, యర్రగోర్ల శ్రీరాములు, కనపర్తి కొండా, అంగిరేకుల నాగేశ్వరరావు, జొన్నలగడ్డ రామకృష్ణ, బొడ్డు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

126 మందికి ప్రతిభా పురస్కారాలు అందజేత

కృష్ణలంక(విజయవాడతూర్పు): బాలికా విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న బాలికలకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నామని కోరమండల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో కోరమండల్ ఇంటర్నేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తొమ్మిదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 126 మంచి విద్యార్థులకు రూ. 5లక్షల 28 విలువైన బాలికా విద్యా స్కాలర్‌షిప్ పురస్కారాలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకం కింద బాలికా విద్య స్కాలర్‌షిప్‌లను సంస్థ చేపట్టిందన్నారు. విద్య, సమాజాభివృద్ధికి సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో రీజినల్ బిజినెస్ హెడ్ చక్రవర్తి, డీజీఎం సచ్చిదానందరెడ్డి, మేనేజర్లు మురళీ, శ్రీను, సుధాకర్ గాయత్రి పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న కోరమండల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజవకర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు అల్లుడు మంచుకొండ చక్రవర్తి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన 63వ డివిజన్ పాత రాజీవ్‌నగర్‌లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో వెలంపల్లి శ్రీనివాసరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన 63వ డివిజన్‌ను వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. తాగునీటి సరఫరా, సిమెంట్ రోడ్లు, పార్కులు, నాడు-నేడుతో పాఠశాలల్లో అదనపు తరగతి గదులు నిర్మించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మోదుగుల గణేష్, టిక్యం కృష్ణ, తిరుపతిరావు, శివారెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సమగ్ర అభివృద్ధి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అల్లుడు మంచుకొండ చక్రవర్తి అన్నారు. స్థానిక 28వ డివిజన్‌లో శనివారం వెలంపల్లి సోదరులు రాఘవ, రాము, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌ఛార్జి కనపర్తి కొండలరావు, గుడిపాటి దత్తు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేస్తున్న చక్రవర్తి



28వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న చక్రవర్తి